ముదిరాజ్ గ్రామకమిటీ ఎన్నిక

నెంటూర్ ముదిరాజ్ కమిటీ సభ్యులు

వర్గల్, మార్చి 17 : మండలంలోని నెంటూర్ ముదిరాజ్ గ్రామకమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. ముదిరాజ్ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నీరుడు చంద్రం,ఉపాధ్యక్షుడిగా బీఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు కిచ్చగారి కనకరాజు,ప్రధాన కార్యదర్శిగా జగ్గారి రమేశ్, సలహాదారులుగా లింగ కిష్టయ్య, సత్తయ్య,రాములు, మల్లేశ్,శరవయ్య, నీరుడి ముత్యాలుతోపాటు పులువురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

కోటి తలంబ్రాల దీక్షలో భక్తులు

వడ్లను తలంబ్రాలుగా మర్చుతున్న భక్తులు

గజ్వేల్, మార్చి 17 : కోటి తలంబ్రాల దీక్షలో భక్తులు పాల్గొని వడ్లను తలంబ్రాలుగా మార్చారు. పట్టణంలోని శ్రీకృష్ణ ఆలయంలో ఆదివారం పట్టణానికి చెందిన భక్తులు వడ్లను తలంబ్రాలుగా తయారు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. భద్రాచలం సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవానికి వాడే తలంబ్రాలను తయారుచేయడంతో ఎంతో సంతృప్తి ఉందని భక్తులు పేర్కొన్నారు.

సిటిజన్ క్లబ్ అధ్యక్షుడిగా యాదగిరి

సిటిజన్‌క్లబ్ సభ్యుల బాధ్యతల స్వీకరణలో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్, మార్చి 17 : గజ్వేల్ సిటిజన్ క్లబ్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిని నాయిని యాదగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదివారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో సిటిజన్ క్లబ్ సభ్యులు పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సంద్భంగా వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు నూతనంగా ఎన్నికైన సిటిజన్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులతో పాటు సభ్యులను సన్మానించారు.

రైతులకు అండగా ఎమ్మెల్యే పల్లా

తపాస్‌పల్లి రిజర్వాయర్ వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొమురవెల్లి, మార్చి 17 : జనగామ నియోజవకవర్గంలో రైతులకు అండగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఉంటున్నాడని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్ వద్ద గోదావరి జలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు నీళ్ల ఎద్దటి వల్ల ఎండిపోతున్నాయని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన వెంటనే ఇరిగేషన్ అధికారులో మాట్లాడి తపాస్‌పల్లి రిజర్వాయర్ లోకి గోదావరి జలాలను విడుదల చేయించారన్నారు. రైతాంగంతో పాటు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే పల్లాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొమురవెల్లి, చేర్యాల ఎంపీపీలు తలారి కీర్తనాకిషన్, వుల్లంపల్లి కరుణాకర్, జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, చేర్యాల, కొమురవెల్లి ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షులు బాలరాజు, సాయిమల్లు, చేర్యాల, కొమురవెల్లి మండలాల బీఆర్ఎస్ నాయకులు, తాజా మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 17 : మద్దూరు మండలంలోని లద్దూర్ ఉన్నత పాఠశాలలో 1998-99 టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. 25 ఏండ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు.

కురుమలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య తదితరులు

సిద్దిపేట టౌన్, మార్చి 17 : కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు.కురుమ సంఘం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా కురుమ మహిళా ఉద్యోగులను సత్కరించారు. అనంతరం ఎల్లయ్య మాట్లాడుతూ కురుమలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో రాములు, మల్లయ్య, రమేశ్, లక్ష్మణ్, రాములు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పద్ధతిగా చదువుదాం.. పదికి పదిసాధిద్దాం

- పక్కా ప్రణాళికతో మెరుగైన ఫలితాలు
- నిద్ర, ఆహారం విషయంలో నిర్లక్ష్యం వద్దు
- ప్రతి సబ్జెక్టుకు సమయపాలన అవసరం
- మానసిక నిపుణుల సూచనలు

టెన్త్ విద్యార్థులకు పది సూత్రాలు కీలకం

సిద్దిపేట అర్బన్/కొమురవెల్లి, మార్చి 17: ప్రతి విద్యార్థి జీవితంలో టెన్త్ అనేది అత్యంత కీలకమైనది. పరీక్షలు వస్తున్నాయంటే విద్యార్థుల్లో ఆందోళన ఉంటుంది. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంచేలా తల్లిదండ్రులు దిశానిర్దేశం చేయాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి రివిజన్ చేసుకుంటూ పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సన్నద్ధం కావాలని పేర్కొంటున్నారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువు కొనసాగిస్తే.. మంచి ఫలితాలు సాధించవచ్చు. ముఖ్యంగా విద్యార్థులు పది సూత్రాలను పాటిస్తే మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది. సబ్జెక్ట్ మీద పట్టు ఉండటంతో పాటు కొన్ని కీలక అంశాలను పాటిస్తే విద్యార్థులకు సులభంగా ఉంటుంది. ఈ కింది పది సూత్రాలను పాటిస్తే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించవచ్చు.

ఏ ఏ పాఠాలు చదువుకోవాలి ?

విద్యార్థులు ప్లాన్ ప్రకారం పాఠాల వారీగా, విషయాలు శ్రద్ధగా చదవాలి. ప్రశ్నాపత్రాలను తయారు చేసుకొని వాటికి సమాధానం రాయాలి. ప్రతిరోజూ ఆరు సబ్జెక్ట్‌లను చదువుతూ.. యూనిట్ టెస్ట్‌లు, త్రైమాసిక, అర్ధవార్షిక, ప్రీ ఫైనల్ పరీక్షల్లో రాసిన సమాధాన పత్రాలను పరిశీలించి తప్పులను సరిదిద్దుకోవాలి. ఒక హార్డ్ సబ్జెక్ట్ చదివిన తర్వాత సులభమైన సబ్జెక్ట్‌ను ఎంచుకొని చదువుకోవాలి.

ఎలాంటి ఆహారం తీసుకోవాలి..?

విద్యార్థులు పరీక్షల సమయంలో ఆహారం విషయంలో పలు జాగ్రత్తలు పాటించాలి. చిరు తిండ్లు మానుకోవడంతో పాటు మసాలాలతో కూడిన పదార్థాలను తగ్గించుకోవాలి. తేలికపాటి ఆహారమైన ఇడ్లి, ఉప్మా, ఆకుకూరలు, వైట్ రైస్, పప్పు, రసం, మజ్జిగ లాంటివి తక్కువ మోతాదులో తీసుకోవాలి. ఎక్కువగా తింటే నిద్రవచ్చే అవకాశం ఉంటుంది. పండ్లు ఎక్కువగా తినాలి. పండ్లరసాలు ఎక్కువగా తాగాలి.

ఎన్ని గంటలు నిద్రపోవాలి..?

ప్రతి విద్యార్థి ఆరు గంటలు తప్పకుండా నిద్రపోవాలి. పరీక్షల సమయమని చెప్పి రాత్రంగా చదువుకొని తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దు. రాత్రి సమయంలో ఎక్కువగా మేల్కొని ఉంటే దాని ప్రభావం పరీక్షలపై పడి.. సరిగ్గా రాయలేకపోతారు. అందుకే సరైన సమయానికి పడుకొని.. సరైన సమయానికి నిద్రలేస్తే బాగుంటుంది. ఉదయం లేచి చదివితే జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని మానసిక నిపుణులు సూచిస్తున్నారు.

ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలి..?

ఆరోగ్యమే మహాభాగ్యం ..అందుకే విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పరీక్షలు జరుగుతున్నప్పుడు ఎండలు ఎక్కువగా ఉంటాయి. వడదెబ్బ తాకకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలి. నీరు అధికంగా తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత సమతుల్యంగా ఉంటుంది.

పరీక్షకు ఎలాంటి వస్తువులు తీసుకెళ్లాలి ?

పరీక్ష జరిగే సమయంలో విద్యార్థులు హాల్ టికెట్ నుంచి అన్ని వస్తువులు ఉన్నాయో.. లేవో ఒకటికి రెండుసార్లు చూసుకొని వెళ్లాలి. పెన్సిల్, రబ్బర్, పెన్నులు, ప్యాడ్, వాటర్ బాటిల్ ఇలా అన్ని ఒకే ప్రదేశంలో ఉంచుకుంటే పరీక్షకు బయలుదేరేటప్పుడు టెన్షన్ పడే అవసరం ఉండదు.

పరీక్షకు ఎలా వెళ్లాలి..?

మన ఇంటి దగ్గర నుంచి పరీక్షా కేంద్రానికి ఎంత దూరం ఉంటుందో తెలుసుకొని.. ఎంత సమయంలో మనం అక్కడికి చేరుతామో దాన్ని బట్టి ఒక అంచనా వేసుకోవాలి. ఏ విధంగా వెళ్తే తొందరగా చేరుకుంటామో దానికి అనుగుణంగా ప్లాన్ చేసుకోవడం మంచిది. పరీక్షా సమయానికంటే అరగంట ముందే చేరుకుంటే ఎలాంటి టెన్షన్ లేకుండా పరీక్ష రాయవచ్చు.

పరీక్ష హాల్‌లో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి..?

పరీక్ష హాల్‌లోకి వెళ్లగానే రెండు నిమిషాలు ధ్యానం చేయడం చాలా మంచిది. ఒక గ్లాస్ నీరు తాగి మన చుట్టు పక్కల ప్రదేశాన్ని చూసుకోవాలి. మన చుట్టు పక్కల కాగితాలు, చిట్టీలు ఏమీ లేకుండా చూసుకోవాలి. ఇన్విజిలేటర్ సూచించిన విధంగా సమాధానపత్రాన్ని రెడీ చేసుకోవాలి. ప్రశ్నాపత్రం ఇచ్చిన వెంటనే ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా చదివి.. మనకు వచ్చిన సమాధానాలను ముందుగా సమయం వృథా చేయకుండా రాయాలి. రెండు గంటల సమయంలో మెయిన్ పేపర్ పూర్తి చేసుకొని ఆబ్జెక్టివ్ కోసం వేచి చూడాలి. ఎలాంటి కొట్టివేతలు, అక్షరదోషాలు ఉండకుండా సరిగ్గా చూసుకోవాలి.

చక్కని చేతిరాత ఉండేలా చూసుకోవాలి..

సంవత్సరమంతా చదివింది పరీక్ష జరిగే రెండు గంటల్లో రాయాల్సి ఉంటుంది. అందమైన చేతిరాత ఉండే విధంగా జాగ్రత్త పడాలి. అక్షరదోషాలు, కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి. పెద్ద అక్షరాలను అందంగా రాస్తూ.. హెడ్డింగ్‌లకు అండర్‌లైన్ పెడితే బాగుంటుంది. పదానికి, పదానికి మధ్య సమానమైన స్థలాన్ని వదులుతూ.. అవసరం ఉన్న దగ్గర పుల్‌స్టాప్‌లు, కామాలు ఉండేటట్లు చూసుకోవాలి. సబ్జెక్ట్‌కు అనుగుణంగా అక్షరాలను అందంగా, ఆకర్షణీయంగా రాయాలి.

పరీక్ష పేపర్‌ను ఎలా కట్టాలి..?

పరీక్ష పూర్తయి సమయం ముగిసిన వెంటనే రాసిన పత్రాలను పేజీ నంబర్లు వేసుకుంటూ ఒక ఆర్డర్ ప్రకారం పెట్టుకోవాలి. ఆబ్జెక్టివ్ పేపర్ చివరగా పెట్టి సరైన విధంగా పేపర్‌ను కట్టుకోవాలి. సమాధానాలు ఏ విధంగా రాశామో చూసుకొని ఒక దాని తర్వాత ఒకటి వచ్చే విధంగా కట్టుకోవాలి. చివరి నిమిషంలో ఎలాంటి టెన్షన్ గురికాకుండా పేపర్‌ను కట్టుకోవాలి.

పరీక్ష ముగిసిన తర్వాత ఏం చేయాలి..?

పరీక్ష అయిపోయిన వెంటనే పరీక్ష హాల్ నుంచి బయటకు వచ్చి తాము రాసిన సమాధానాలు ఇతర విద్యార్థులతో చర్చించి తెలుసుకుంటారు. ఒకవేళ తమ సమాధానం తప్పు అయితే మరుసటి రోజు జరిగే పరీక్ష మీద దాని ప్రభావం పడే అవకాశం ఉన్నందున సమాధానాలపై చర్చించకపోవడం మంచిది. ముందు రోజు సమాధానాలపై ఆలోచిస్తూ.. మరుసటి రోజు పరీక్ష పై దృష్టి పెట్టకపోయే ప్రమాదం ఉంటుంది కాబట్టి చర్చ జోలికి వెళ్లవద్దు.

ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలి

టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలి. పరీక్షల కంటే ముందు, పరీక్షలు జరిగే సమయంలో, పరీక్ష జరిగిన తర్వాత పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యం గా మన ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ.. నాణ్యమైన ఆహారం తీసుకుంటూ విద్యార్థులు తమ చదువును కొనసాగించాలి. మనం ఏడాదంతా కష్టపడి చదువుకున్న చదువు వ్యర్థం కాకుండా పైన సూత్రాలను పాటిస్తూ టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నా.

- ఎజాస్ అహ్మద్,
ప్రముఖ చేతిరాత నిపుణుడు

టెన్త్ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మార్చి17: టెన్త్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎమ్మెల్యే సూచించారు. నేటి (సోమవారం) నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్న సందర్భంగా విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత చదువులకు టెన్త్ తొలి మెట్టుగా ఆయన పేర్కొన్నారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి, జిల్లాలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని దుబ్బాక నియోజకవర్గం విద్యార్థులను ఆయన కోరారు.

యోగా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చేర్యాల, మార్చి 17 : పట్టణంలోని వికాస్ గ్రామర్ స్కూల్‌లో ఆనంద యోగా ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు మంతపురి చంద్రమౌళి, బునాద్రి కిషన్ తెలిపారు. వ్యాస మహర్షి యోగా సొసైటీ సిద్దిపేట సహకారంతో సేవా భారతి చేర్యాల ఆధ్వర్యంలో ప్రముఖ యోగా గురువు తోట సతీశ్ ఈ నెల 18 నుంచి వారం రోజులు ఉచితంగా యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నిత్యం సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు నిర్వహించే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

హుస్నాబాద్‌టౌన్, మార్చి 17: హుస్నాబాద్ సిద్ధేశ్వరస్వామి గుట్టపై వెలిసిన అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు అయ్యప్పస్వామి ఆలయకమిటీ అధ్యక్షుడు ఆకుల వెంకట్ తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం గణపతి పూజ, పంచామృతాభిషేకం, హోంతోపాటు దివ్యపదునెట్టాంబడిపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్పస్వామి భక్తులు పెద్ద సంఖ్యలో వార్షికోత్సవానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భూములు పరిశీలించకుండానే అనుమతులు

కొమురవెల్లి, మార్చి 17 : భూములు పరిశీలించకుండానే డీటీపీసీ లే అవుట్‌కు అధికారులు అనుమతులు ఇచ్చారని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ఆరోపించారు. ఆదివారం మండలంలోని రసూలాబాద్ గ్రామపంచాయతీ పరిధిలోని గుగ్గిలకుంట చెరువు మత్తడి వాగును సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాగు సమీపంలోని దుర్గమ్మ గుడి వద్ద గల లేఅవుట్‌కు డీటీపీసీ అనుమతులు ఉన్నాయన్నారు. వాగు బ్రిడ్జిని తగ్గించి పైపులైన్ వేసుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారని వెంటనే అధికారులు స్థలాన్ని పునఃపరిశీలించి అనుమతులను రద్దు చేయాలని లేకపోతే పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ తేలు ఇస్తారి, నాయకులు ఉల్లంపల్లి సాయిలు, సున్నం యాదగిరి, ఆరుట్ల రవి, ఎండీ.గోరెమియా, కనకయ్య, యాదయ్య, నవీన్ పాల్గొన్నారు.

షిరిడీలో కళా ప్రదర్శన

సిద్దిపేట టౌన్, మార్చి 17 : షిరిడీ సాయిబాబా శతాబ్ది మండపంలో జరిగిన కళా వైభవంలో సిద్దిపేటకు చెందిన భవానీ క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ శిష్య బృందం 24 మంది అద్భుతకళా ప్రదర్శనతో అబ్బురపర్చారు. భవానీ విద్యార్థులతో కలిసి పుష్పాంజలి,శివశృతి, లింగాష్టకం, గంగాధర, సాయిబాబా గీతాలపై, పేరిని నృత్యం, కూచిపూడి తదితర వాటిపై కళా ప్రదర్శన ఇచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. షిరిడీ సాయిబాబా ఆలయ ఈవో సునీల్‌జూదే కాశీ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు.

గట్టు మల్లన్న ఆలయ హుండీ లెక్కింపు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి17: ధూళిమిట్ట మండలంలోని కొండాపూర్ గట్టు మల్లన్న ఆలయ హుండీని ఆదివారం లెక్కించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు రోజుల పాటు జరిగిన గట్టు మల్లన్న జాతరకు వచ్చిన భక్తులు ఆలయ హుండీలో వేసిన కట్నకానుకలను గ్రామస్తులు లెక్కించారు. రూ.30వేల నగదుతో పాటు వెండి ఆభరణాలు వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కానుకలను లెక్కిస్తున్న గ్రామస్తులు

నేడు జిల్లా స్థాయి రోబోటిక్స్ ఎగ్జిబిషన్

సిద్దిపేట టౌన్,మార్చి 17 : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జిల్లా స్థాయి రోబోటిక్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ తెలిపారు. కళాశాలలో ఆదివారం అందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ..నూతన ఆలోచనలతో విభిన్న ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి రోబోటిక్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన రోబోటిక్స్ మోడల్స్‌ను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సహదేవ్ శ్రీనివాస్, సుదర్శనం, అయోధ్యరెడ్డి, మధుసూదన్, బైరయ్య, కృష్ణయ్య,సౌమ్య పాల్గొన్నారు.

గులాబీ జెండా..కొండంత అండ

- పార్టీని విడిచిపోతున్న వారికి ధన్యవాదాలు
- వాట్సాప్ గ్రూపుల్లో జోరుగా చర్చ
- చేర్యాల యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య

శివగారి అంజయ్య

చేర్యాల, మార్చి 17 : ఓటమిలో ఉన్న బీఆర్ఎస్ పార్టీని విడిచి అధికారపార్టీలోకి వెళ్తున్న ప్రతి ఒక్క నాయకుడికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నామంటూ చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల బీఆర్ఎస్ యువజన విభాగం ఇన్‌చార్జి శివగారి అంజయ్య వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు దానికి లైక్‌లు కొడుతున్నారు. రెండు రోజులుగా చేర్యాల ప్రాంతంలో ఈ పోస్టు పై జోరుగా చర్చ జరగడమే కాకుండా లైక్‌లతో ట్రెండ్ అవుతున్నది.గడిచిన పదేండ్లు మీరు గౌరవ పదవులు అనుభవించి ప్రజల్లో గుర్తింపుపొందారు...కానీ అధికారం లేకపోతే మీరు ఉండలేకపోతున్నారు..మీకు మీ ఉనికిని కాపాడుకోవడం ముఖ్యం అర్థం చేసుకోగలం.మంచిది.. ధన్యవాదాలు. ఎందుకంటే ? మా పార్టీ పెద్దలకు మీరు చేస్తున్న ఈ ద్రోహం వారు ఎప్పటికీ మర్చిపోరు...లక్షలాది మంది కార్యకర్తల పార్టీ మాది..కొత్త నాయకత్వం సిద్ధంగా ఉంది.ప్రజలు సిద్ధంగా ఉన్నారు..ఉద్యమకారులు, మేధావులు, యువ నాయకులు చాలా మంది ఉన్నారు.మీలాంటి స్వార్థపరులు పోతే..మాకు మంచి అవకాశాలు వస్తాయి... తిరిగి గులాబీ జెండా ఎగురవేస్తాం...కానీ అప్పుడు మాత్రం తిరిగి పార్టీలోకి సిగ్గులేకుండా మళ్లీ రాకండి..ఒకవేళ వచ్చినా ఈ రోజు పార్టీకి మీరు చేస్తున్న ద్రోహం మర్చిపోము..జై కేసీఆర్..జై తెలంగాణ అంటూ చేసిన పోస్టు ప్రతి ఒక్కరినీ అకట్టుకుంటున్నది.

కల్యాణ మహోత్సవానికి అంకుర్పారణ

చేర్యాల, మార్చి 17 : మండలంలోని ఆకునూరులో గొల్లకురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప కామరతి కల్యాణ మహోత్సవానికి గొల్లకురుమలు ఆదివారం అంకురార్పణ చేశారు.కులస్తులు జల్లికడువలతో డోలు వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.అనంతరం బీరప్ప దేవాలయానికి చేరుకుని దేవుళ్లకు గంగస్నానం చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించి పాలు, నెయ్యి పోసి బీర్ల పూజారులతో కల్యాణ ముహూర్తం ఖరారు చేశారు. ఏప్రిల్ 1న మధ్యాహ్నం 12.36 గంటలకు బీరప్ప కామరతి కల్యాణం నిర్వహించనున్నారు. మార్చి 30 నుంచే పండుగ ప్రారంభమవుతుందన్నారు.

జల్లి కడువలతో ఊరేగింపుగా వెళ్తున్న గొల్లకురుమలు

అక్రమంగా నల్లమట్టి తరలింపు

- నల్లమట్టి వ్యాపారులకు కాసుల వర్షం
- చెరువులు లూటీ అవుతున్నా పట్టించుకోని అధికారులు

గజ్వేల్, మార్చి 17 : నల్ల మట్టి వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తున్నది. వేసవి వచ్చిందంటే చాలు అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులోని నల్లమట్టిని తరలిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల అండతో గ్రామస్తులకు పదో పాచి కో ఇచ్చి వ్యాపారులు దొరికనంత నల్లమట్టిని తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. నిత్యం వందలాది టిప్పర్ల ద్వారా చెరువు నుంచి తీసిన నల్లమట్టి ఇటుక బట్టీలకు తరలిస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల అండతోనే ఇదంతా జరుగుతుందనే విమర్శలు గుప్పుమంటున్నాయి. గజ్వేల్ మండలం బెజుగామ గ్రామ సమీపంలోని రాగి చెరువులోని నల్లమట్టిపై వ్యాపారుల కన్నుపడింది. ఎలాగైనా మట్టిని ఇటుక బట్టీలకు అమ్ముకొని సొమ్ముచేసుకోవాలని రాగిచెరువు మట్టికి రూ.25లక్షల ధర నిర్ణయించారు. రాత్రి సమయంలో పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా వ్యాపారులు నల్లమట్టిని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు తరలిస్తూ అధిక ధరకు విక్రయిస్తున్నారు. రాత్రి సమయంలో తరలిస్తే ఎలాంటి సమస్య ఉండదనే ఉద్దేశంతో వ్యాపారులు అదే అదునుగా మట్టిని తరలిస్తున్నారు. వేసవి వచ్చిందంటే చెరువుల్లోని నల్లమట్టిని ఇటుకబట్టీలకు తరలిస్తూ కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులపై ఎక్కడ కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కొద్ది రోజులుగా నల్లమట్టిని తరలిస్తున్నా ఇరిగేషన్ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రతి సంవత్సరం ఇదే చెరువుమట్టిని అక్రమంగా వ్యాపారులు తరలించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పక్కనే ఉన్న ఆరెపల్లి చెరువు నుంచి కూడా మట్టి తరలింపు ప్రారంభమైంది. ఇంత జరుగుతున్నా అధికారులు మా త్రం తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గజ్వేల్ రింగ్‌రోడ్డు మీదుగా నల్ల మట్టితో వెళ్తున్న టిప్పర్లు

ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు

గజ్వేల్ మండలంలోని ఏ గ్రామ చెరువు నుంచి కూడా మట్టి తీసేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ప్రతి రోజూ ఆయా గ్రామాల చెరువులను లష్కర్‌లతో పర్యవేక్షణ చేయిస్తున్నాం. ఎక్కడ చెరువు నుంచి మట్టి తీసినా చర్యలు తీసుకుంటాం.

–మోతియా, ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ, గజ్వేల్